ప్రజాభిమానంతో మళ్లీ టికెట్లు

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, 24 మంది లోక్‌సభ అభ్యర్థులను ఇడుపుల పాయలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రజాభిమానం పొందిన కృష్ణా జిల్లాలోని గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గ అభ్యర్థులుగా కొడాలి శ్రీవేంకటేశ్వరరావు(నాని), కై లే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)ను ప్రకటించారు. దీంతో ఆయా నియోజకవర్గాల్లోని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు చేసుకున్నారు.

గుడివాడ నియోజకవర్గం

పేరు: కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)
ప్రస్తుత హోదా: గుడివాడ ఎమ్మెల్యే
పుట్టిన తేదీ : 21-10-1971
తండ్రి పేరు: కొడాలి అర్జునరావు
తల్లి పేరు: వింధ్యారాణి
భార్య పేరు: అనుపమ
కుమార్తెలు: విజయదుర్గ, కనకదుర్గ
సోదరుడు: కొడాలి నాగేశ్వరరావు(చిన్ని)


కొడాలి నాని

రాజకీయ ప్రస్థానం:
కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) 2004 సంవత్సరానికి ముందు తెలుగు యువత జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. అనంతరం 2004, 2009 కాలాల్లో గుడివాడ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం జరిగిన పరిణామాల్లో 2014, 2019 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించారు. 2019లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వచ్చిన అనంతరం రెండున్నర సంవత్సరాలు రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రిగా కూడా కొడాలి నాని పని చేశారు.

పామర్రు నియోజక వర్గం

పేరు : కైలే అనిల్‌కుమార్
ప్రస్తుత హోదా: పామర్రు ఎమ్మెల్యే
పుట్టిన తేదీ : 13-02-1977
తండ్రిపేరు : కైలే సంజీవరావు
తల్లి పేరు : జ్ఞానమణి
భార్య పేరు : హేమలీన
కుమార్తె పేరు: ఆరాధ్య


కైలే అనిల్‌కుమార్

రాజకీయానుభవం:
కైలే అనిల్‌కుమార్ తల్లిదండ్రులు రాజకీయాల్లో ఉన్నారు. తండ్రి కైలే సంజీవరావు గతంలో కాంగ్రెస్ పార్టీలో 40 ఏళ్లు నాయకుడిగా ఉండేవారు. తల్లి కైలే జ్ఞానమణి బాపులపాడు మండల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యురాలిగా ఉన్నారు. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. పామర్రు ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన తర్వాత కైలే అనిల్ కుమార్ తే18-01-2017 నుంచి పామర్రు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా పని చేశారు. పార్టీ ఆదేశించిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహిస్తూ నియోజకవర్గంలో పేరు సంపాదించారు. 2019 సంవత్సరంలో పామర్రు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు.

కైకలూరు నియోజకవర్గం

అభ్యర్థి పేరు : దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)
ప్రస్తుత హోదా: కైకలూరు ఎమ్మెల్యే
పుట్టిన తేదీ : 09-07-1967
తల్లిదండ్రుల పేర్లు:వీరన్న, భూషమ్మ
భార్య పేరు : వీరాకుమారి
సంతానం :వినయ్ కుమార్, శ్యామ్ ఫణికుమార్
వృత్తి : ఆక్వా రైతు
కులం : కాపు
స్వస్థలం : కైకలూరు


దూలం నాగేశ్వరరావు

రాజకీయ నేపథ్యం :
దూలం నాగేశ్వరరావు కైకలూరు సర్పంచ్‌గా 2006–2011 మధ్య పని చేశారు. (ఏపీ సర్పంచ్‌ల చాంబర్ వైస్ ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. 2008లో గుడ్లవల్లేరు వచ్చిన దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2011 ఆగస్టు 15న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. 2019లో కైకలూరు ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

సేవా కార్యక్రమాలు : అమ్మ సేవా సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నిమ్మకూరు(పామర్రు): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని నిభానుపూడి పీఏసీఎస్ పరిధిలో నిమ్మకూరులో నిర్మించిన గోదామును కేడీసీసీ బ్యాంక్ అధ్యక్షురాలు తాతినేని పద్మావతితో కలిసి శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి రైతు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి సేవలను అందిస్తున్నారన్నారు. నాబార్డు నిధులు రూ.40 లక్షలతో పీఏసీఎస్‌లో గోదామును నిర్మించినట్లు తెలిపారు. ఇందులో సుమారు 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంగల ధాన్యం మినుములు తదితరాలను నిల్వ చేసుకోవచ్చన్నారు. కేడీసీసీ బ్యాంక్ జిల్లా చైర్మన్ తాతినేని పద్మావతి మాట్లాడుతూ రైతులకు కావాల్సిన అన్ని రకాల సేవలను బ్యాంక్‌ల ద్వారా అందిస్తున్నామని అన్నారు. సబ్సిడీలపై అన్ని రకాల రుణాలను తక్కువ వడ్డీకే రైతులకు అందిస్తున్నామన్నారు. నిభానుపూడి పీఏసీఎస్ అధ్యక్షుడు చిగురుపాటి ప్రవీణ్(మురళీ) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి, కురుమద్దాలి సర్పంచ్ జీ విజయభారతి, నాయకులు దాసి మల్లికార్జునరావు, నవుడు సింహాచలం, పీఏసీఎస్ కార్యదర్శి ఎస్ దేవయ్య పాల్గొన్నారు.


నిమ్మకూరులో గోదాము శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పేదల సంక్షేమమే లక్ష్యం
పమిడిముక్కల: పేదల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. కపిలేశ్వరపురంలో నూతనంగా నిర్మించిన అంగనవాడీ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సీసీరోడ్లకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సర్పంచ్ బులా నాగమణి, ఎంపీటీసీలు మరీదు రాజ్యలక్ష్మి, కంచర్ల అంక కుమారి, నాయకులు మస్తాన్‌రావు, శ్రీనివాసరావు, ప్రసాద్, ఏఈఈ శరాబందిరాజు, కార్యదర్శి విద్యాధర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు

గుడివాడ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఇస్తున్న ప్రాధాన్యతను సంతరించుకుని టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన పలువురు ముస్లిం మహిళలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నట్లు ముస్లిం మైనార్టీ నాయకుడు మహ్మద్ ఖాసీం(ఆబూ) తెలిపారు. శనివారం వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), బందరు పార్లమెంట్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు సమక్షంలో 200 మంది మహిళా కార్యకర్తలు పార్టీలో చేరారు. టీడీపీ యువనేత ఎండీ మతిన్, జనసేన మహిళానేత షేక్ దిల్దార్, తదితరులకు కొడాలి నాని పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తనను, పార్లమెంట్ సభ్యుడిగా పోటీచేస్తున్న డాక్టర్ చంద్రశేఖరరావును భారీ మెజార్టీతో గెలిపిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాజీ, అలీబేగ్, రిజ్వాన్, ఫజల్, అబ్దుల్ గఫార్, షరీఫ్, కాజ, ఎండీ సాలేహా, మున్నా పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

కైకలూరు సీటును జగన్‌కు కానుకగా ఇస్తాం

కైకలూరు: మరో పర్యాయం కైకలూరు ఎమ్మెల్యే సీటును గెలిపించుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా అందిస్తామని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. కైకలూరు అసెంబ్లీ సీటు తిరిగి దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్)కు కేటాయించడంపై నివాసం వద్ద డీఎన్నార్‌ను శనివారం ఆయన అభినందించారు. ఆయనతో పాటు సయ్యపురాజు గుర్రాజు ఉన్నారు.

డీఎన్నార్‌ను అఖండ మెజారిటీతో గెలిపించండి
కైకలూరు: ప్రజలందరికీ సేవ చేయాలనే తన భర్త, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) నిరంతరం ఆలోచిస్తారని, ఆయన పనితీరు నచ్చే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో పర్యాయం ఎమ్మెల్యేగా అవకాశం కల్పించారని.. ఆయన్ను భారీ మెజారిటీతో గెలిపించాలని డీఎన్నార్ సతీమణి వీరాకుమారి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రామవరం గ్రామంలో ఆమె శనివారం ఇంటింటికీ వెళ్లి డీఎన్నార్ తరుపున ఓట్లు అభ్యర్థించారు.

సంక్షేమాన్ని చూసి ఓటేయండి
ముదినేపల్లి రూరల్: ముఖ్యమంత్రి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ కోరారు. మండలంలోని వి.రావిగుంట, ఊటుకూరు గ్రామాల్లో సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి శనివారం ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డీఎన్నార్, కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, అల్లాభక్షు, కుమార్, సతీష్, పృథ్వీ పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ

వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం

గుడివాడ టౌన్: వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, ముస్లిం కాజాల దీవెనలు, పాస్టర్ల ఆశీర్వచనాల మధ్య గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని), బందరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ నూటికి నూరుశాతం తాను, ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు విజయం సాధిస్తామన్నారు. భగవంతుని ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజల ఆశీస్సులు తమపై మెండుగా ఉన్నాయని, ప్రజలే మమ్ములను గెలిపిస్తారన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ చంద్రశేఖరరావు మాట్లాడుతూ పార్లమెంట్ పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ఎన్నికలకు వెళుతున్నామన్నారు. కొడాలి నానీతో కలిసి పనిచేయడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రజలకోసం నిజాయితీగా పనిచేస్తామని మనస్ఫూర్తిగా చెబుతున్నామన్నారు. జెడ్పీటీసీ సభ్యులు జి. రామకృష్ణ, కందుల దుర్గాకుమారి, ఎంపీపీలు గద్దే పుష్పరాణి, పెయ్యల ఆదాం,మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మట్టా నాగమణి, నాయకులు కొడాలి నాగేశ్వరరావు (చిన్ని) మండలి హనుమంతరావు, ఎంపీ నారాయణరెడ్డి, గొర్ల శ్రీను, కాళీ, పురుషోత్తం, శశిభూషణ్, రామ్‌ప్రసాద్, పాలేటి చంటి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు సూర్యప్రకాశరావు, సూర్యప్రభ, సత్యవేణి, భాస్కరరావు, నరసింహారావు, కె. ఆంజనేయ ప్రసాద్, శేఖర్, నీలాకాంత్, ఎలీషా, డాక్టర్ శ్యామ్‌కుమార్ పాల్గొన్నారు.


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, డాక్టర్ చంద్రశేఖరరావు

నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం



గుడివాడ టౌన్: స్థానిక బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ఘనంగా జరిగింది. ఆలయ ఈఓ వీడీడీ ప్రసాదరావు నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. పాలక మండలి సభ్యులుగా పుల్లేటికుర్తి వెంకట కృష్ణారావు, ఎర్రమల్ల వెంకట కృష్ణ, బేరా వెంకటలక్ష్మి, కొమ్ము విజయలక్ష్మి, ముద్ర జయశ్రీ, వడ్లాది నాంచారమ్మ ప్రమాణ స్వీకారం చేశారు. త్వరలో పాలక మండలి చైర్మన్ ఎంపిక జరుగుతుందని ఈఓ తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్ల రూపాయలు వెచ్చించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, నాయకులు ఎంపీ నారాయణరెడ్డి, మండలి హనుమంతరావు, మెరుగుమాల కాళీ, అద్దేపల్లి పురుషోత్తం, పాలేటి చంటి, వడ్లాని సుధాకర్, చుండూరు శేఖర్, పంచకర్ల వెంకట్ పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వ్యక్తులను ఆదరించండి

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గ ప్రజల కోసం కష్టపడి పని చేసిన వ్యక్తులను అందరూ ఆదరించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. గుడ్ మార్నింగ్ కైకలూరు పేరుతో చేస్తున్న కార్యక్రమం శనివారానికి 14వ రోజుకు చేరింది. 2వ వార్డులో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ అడవి కృష్ణ, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బలే నాగరాజు వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, ముస్లీం మైనార్టీ నాయకులు అబ్దుల్ హమీద్, షేక్ రఫీ, నాయకులు మోహనరావు, మహ్మద్ గాలిబ్ బాబు, వాసవి రవిరాజు, రవిప్రకాష్, ఏసు, సాయి, పంజా నాగు, ఆంజనేయులు, సతీష్ పాల్గొన్నారు.


గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

జగనన్న గ్రీన్ విలేజ్ స్వాగత ముఖద్వారాలు ప్రారంభం
కైకలూరు: నియోజకవర్గానికే తలమానికంగా మారిన కైకలూరు వైఎస్సార్ జగనన్న గ్రీన్ విలేజ్ స్వాగత ముఖద్వారాలను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు జిల్లాలోనే కైకలూరు గ్రీన్ విలేజ్ ప్రథమ స్థానంలో నిలుస్తోందన్నారు. ఒక్క గ్రీన్ విలేజ్‌లోనే 4,000 పైబడి ఇంటి పట్టాలను మంజూరు చేశామన్నారు. కైకలూరు ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, ఎమ్మెల్యే డీఎన్నార్ తనయుడు శ్యామ్, ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులు


నివాళులర్పిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కృష్ణారావు

గుడివాడ టౌన్: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిపారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు పూలమాల వేసి నివాళులర్పించారు. అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు శ్రీరాములుకు నివాళులు అర్పించారు. ఎన్టీఆర్ స్టేడియం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ సభ్యులు స్థానిక వాసవి చౌక్ లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు మెరుగుమాల శివరామకృష్ణ, కార్యదర్శి కోనా రామారావు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి
ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్యసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

కైకలూరులో..
కైకలూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతికి చేసిన సేవలు అజరామరమని సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి అన్నారు. శనివారం ఆయన జయంతి సందర్భంగా కైకలూరు పంచాయతీ కార్యాలయం వద్ద శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి ఏ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో..
తోట్లవల్లూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను ఎన్నటికీ మరువలేమని వాసవీ క్లబ్ జోనల్ చైర్‌పర్సన్ తమ్మన ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక వాసవీ ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వరంలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది.

ఆకట్టుకున్న లేగ దూడల ప్రదర్శన

కైకలూరు: పశు సంవర్థకశాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా వేమవరప్పాడులో నిర్వహించిన లేగ దూడల పోటీ శనివారం ఆకట్టుకుంది. గన్నవరం పశు గణాభివృద్ధి సంస్థ కార్య నిర్వహణాధికారి డాక్టరు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రదర్శనలో 28 లేగ దూడలు పాల్గొన్నాయి. మొదటి బహుమతి బీఎస్ వేంకటేశ్వరరావుకు చెందిన ఒంగోలు జాతి దూడ, రెండో బహుమతి గొల్లేరు సత్యనారాయణ ముర్రా జాతి దూడ, మూడో బహుమతి నున్నా రాంబాబు ముర్రా జాతి దూడ గెలుచుకున్నాయి. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ లింగ నిర్ధారిత వీర్యాన్ని ఉపయోగించుకుని పెయ్యదూడల ఉత్పత్తి చేయవచ్చన్నారు. ఒక్కొక్క లింగ నిర్ధారిత వీర్యనాళిక ఖరీదు రూ.1,350 ఉండగా ప్రభుత్వ సబ్సిడీ రూ.850 అందిస్తోందన్నారు. రైతులు రూ.500 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కైకలూరు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పఠాన్ ముస్తఫా ఖాన్ మాట్లాడుతూ దూడలకు అవి పుట్టిన గంటలోపు జున్నుపాలు తాగించడం శ్రేయస్కరమన్నారు. సర్పంచ్ నున్న రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు బుడవల్లి నాగబాబు, పశువైద్యులు నాగేంద్ర వర్మ, నున్న ఫణీంద్రబాబు, హరిత పాల్గొన్నారు.


లేగదూడల పోటీల్లో విజేతలకు బహుమతిని అందజేస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

గీతాంజలి మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి
కైకలూరు: ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని చెప్పినందుకు సోషల్ మీడియా వేదికగా అవమానించి విశ్వబ్రాహ్మణ సోదరి తెనాలికి చెందిన గీతాంజలి మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు కైకలూరు టౌన్ స్టేషన్‌లో ఏఎస్సై మల్లికార్జునరావుకు శనివారం వినతిపత్రాన్ని అందించారు. ప్రభుత్వం కుటుంబాన్ని ఆదుకున్నందుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు తుపాకుల సోమాచారి, ప్రధాన కార్యదర్శి కర్రి మోజేష్ కుమార్, కోశాధికారి దివిలి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి
కైకలూరు: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసే విధంగా అందరూ సహకరించాలని రూరల్ ఎస్సై టి.రామకృష్ణ చెప్పారు. రూరల్ సర్కిల్ సీఐ బి.కృష్ణకుమార్ ఆధ్వర్యంలో సాయుధ దళాలతో కలసి భుజబలపట్నం, పల్లివాడ, ఆలపాడు గ్రామాల్లో శనివారం కవాతును నిర్వహించారు.

పెద్దింట్లమ్మకు ప్రత్యేక పూజలు
కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మను పెద్ద ఎత్తున భక్తులు శనివారం దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అమ్మవారి జాతర ఆరో రోజుకు చేరింది. వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాద దాతలుగా దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గొట్టుముక్కల శివరామరాజు దంపతులు వ్యవహరించారు.

ఆదివారం ఏర్పాట్లు పూర్తి..
అమ్మవారి జాతరలో ఆదివారం భక్తుల రద్దీ దృష్ట్యా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ గోపాలరావు తెలిపారు.

శ్మశాన వాటికలు అభివృద్ధి చేస్తున్నాం
గుడివాడ టౌన్: పట్టణంలోని క్రైస్తవ, హిందూ శ్మశాన వాటికలు అన్ని అభివృద్ధి చేస్తున్నామని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని 1, 6, 25, 29 వార్డులలోని హిందూ శ్మశాన వాటికల అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, పాలేటి చంటి, అర్కే, పంచకర్ల అమర్, అడపా పండు, పాలడుగు జగదీష్ పాల్గొన్నారు.

బీసీ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన
అయ్యంకి(మొవ్వ): మొవ్వ మండలం అయ్యంకిలోని జగనన్న కాలనీలో రూ.10 లక్షల జెడ్పీ నిధులతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్‌కు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి పార్వతీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాఘవరావుతో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. గ్రామ సర్పంచ్ నాగన బోయిన సునీల్, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, యువజన విభాగం కన్వీనర్ కొలుసు నరిసింహయాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థినికి బెస్టుహ్యాండ్ రైటింగ్ అవార్డు
జుఝువరం(పామర్రు): మండలంలోని జుఝువరం ఉషోదయ హైస్కూల్ విద్యార్థినికి ఏపీ స్టేట్ మిస్ బెస్ట్ హ్యాండ్ రైటింగ్ కాప్టెన్ షిప్ అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ ఎండీ రఫీ శనివారం తెలిపారు. మంగళగిరిలో హ్యాండ్ లూమ్ అండ్ టెక్స్‌టైల్ కార్పొరేషన్ సమావేశ మందిరలో జరిగిన జాతీయ హ్యాండ్ రైటింగ్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని డి.ప్రణాళిక అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

కేసులు రాజీ చేసుకోవడమే రాజమార్గం



గుడివాడ టౌన్: కేసులు రాజీ చేసుకోవడమే రాజమార్గమని 11వ అదనపు జిల్లా జడ్జి (ఇన్‌చార్జి) ఎ. నరసింహమూర్తి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో మండల న్యాయ సేవాధికార కమిటి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం జరిగిన లోక్ అదాలత్‌లో 105 కేసులు పరిష్కరించామని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి, మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి కె. నాగలక్ష్మి పాల్గొన్నారు.

సమస్య పరిష్కరించుకోవడం ఉత్తమం
కైకలూరు: క్షణికావేశంలో చేసిన తప్పులకు కేసులతో తిరుగుతున్న కక్షిదారులు రాజీ మార్గం ద్వారా సమస్యను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి సూచించారు. కైకలూరు కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ శనివారం నిర్వహించారు. మొత్తం 138 కేసులను పరిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి కిరణ్ కుమార్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి

మొవ్వ: ఏపీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీఓ జి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. ముందస్తుగా ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల ఫొటోల తొలగింపు, పబ్లిక్ ప్లేసుల్లో ఫ్లెక్సీలు, బ్యానర్ల తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. పబ్లిక్, ప్రైవేటు ప్లేసుల్లో ఫ్లెక్సీలు పెట్టేవారు అధికారుల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. అలాగే రిటర్నింగ్ అధికారి వద్ద కొంత నగదు డిపాజిట్‌గా చెల్లించి అనుమతులు పొందాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

రాజ్యాంగ ప్రవేశికపై అవగాహన ఉండాలి

మండవల్లి: రాజ్యాంగానికి వెన్నెముక అయిన ప్రవేశికపై బాల్యం నుంచే విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు అన్నారు. శనివారం మూడుతాళ్లపాడు ఎంపీపీ పాఠశాల రిజర్వుడు టీచర్ జి.స్మారకకుమారి ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకంలోని చిత్రాలను చూపించి, చదివించి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాతీయ గీతం, జన గణ మన, జాతీయ పతాకం, మూడు రంగుల జెండా, జాతీయ చిహ్నం బొమ్మలను చూపించి అవగాహన కల్పించారు.

22 నుంచి వీకేఆర్ ఫెస్ట్-2024

గుడివాడ టౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాలలో ఈనెల 22, 23 తేదీలలో వీకేఆర్ ఫెస్ట్-2024 నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. శనివారం కళాశాల మీటింగ్ హాల్లో యాజమాన్యం ఆధ్వర్యంలో ఫెస్ట్ పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో మొదటి రోజు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఉంటాయన్నారు. రెండో రోజు షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్, ఫొటోగ్రఫీ, ఫొటోషాపి ఎడిట్, మాక్‌ప్రెస్, ఇన్‌స్టారీల్స్, జనరల్ అండ్ టెక్నికల్ క్విజ్ ఉంటుందని పేర్కొన్నారు. కల్చరల్ ఈవెంట్స్ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చన్నారు. పూర్తి వివరాలకు 94915 85714ను సంప్రదించాలని కోరారు.

పరీక్ష కిట్లు పంపిణీ

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అంగడాల వేణు ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆంధ్రనలంద మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ప్యాడ్, స్కేల్, రబ్బరు, పెన్సిల్, పెన్నుతో కూడిన కిట్లను అందజేశారు. ఆ సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్, అంగడాల సతీష్, జాజుల తాతారావు, హెచ్‌ఎం లక్ష్మీ స్రవంతి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



గుడివాడ టౌన్: అనారోగ్య సమస్యలతో చికిత్సలు చేయించుకున్న వారికి రూ.1.6 కోట్లు రిలీఫ్ ఫండ్ అందజేసినట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బాధితులకు చెక్కులు పంపిణీ చేశారు. నాయకులు గొర్ల శ్రీను, కె. కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్.శాంతిజ్యోతి శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆమె ఏలూరు నుంచి ఉద్యోగోన్నతిపై కైకలూరు కాలేజీకి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆమెను సన్మానించారు.